సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 18 । జూన్ । 2023



సచివాలయంలోనే రిజిస్ట్రేషన్

చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతారాణి ఆధ్వర్యంలో చినపాచిల గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. 8లో



హాస్టల్ రీమోడల్ 8లో

లారస్ పరిశ్రమ రూ.55 లక్షల సీఎస్ఆర్ నిధులతో రీ మోడల్ చేసిన సమగ్ర బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు.



టార్గెట్ నంబర్ వన్

విశాఖ: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో విశాఖను మొదటి స్థానంలో నిలపాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు.

న్యూస్‌రీల్

కప్పాకప్పా నీలాలు.. కురవాలి వర్షాలు



జగన్నాథపురంలో కప్ప కప్ప నీలాలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో కప్పాకప్పా నీలాలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఓ కర్రకు కప్పను కట్టి ఊరంతా తిప్పారు. కప్పపై నీళ్లు పోస్తూ గ్రామంలోని దేవాలయాల వద్ద అభిషేకాలు చేశారు. వానలు కురవాలి, చెరువులు నిండాలంటూ కప్పను ఊరేగించారు. గ్రామస్థులు ఇచ్చిన బెల్లం,బియ్యంతో ప్రసాదాన్ని తయారు చేసి అందరికీ పంచారు.బాలగణపతి భజన బృందం,బంటు ఆనంద్,భీముని జగన్నాథం, గ్రామస్థులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షాల కోసం, వానదేవుని అనుగ్రహం కోసం కప్పాకప్పా నీలాలు నిర్వహించడం ఆనవాయితీ. జూన్ రెండవ పక్షం వచ్చినప్పటికీ వర్షాలు కురవకపోవడంతో పాటు, వడగాడ్పులు వీస్తుండడంతో జనం అల్లాడిపోతున్నారు.దీంతో వానదేవుని కరుణ కోసం ఇలా పూజలు చేశారు.

20 నుంచి జగన్నాథస్వామి నవరాత్రి మహోత్సవాలు



అనకాపల్లి టౌన్: స్థానిక గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాలులో 9 రోజులపాటు జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో కె.ఆదినారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు స్వామివారు భక్తులకు వివిధ అవతారాల్లో దర్శనమిస్తారని తెలిపారు. 20వ తేదీ ఉదయం 10.15 నిమిషాలకు తొలి రథయాత్ర 29న సాయంత్రం 3 గంటలకు తిరుగు రథాయాత్ర సాగుతుందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

గొలుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి పర్యవేక్షణ చేయాలని అంగన్‌వాడీ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయీదేవి తెలిపారు. ఆమె శనివారం గొలుగొండలో నూతనంగా ప్రారంభించిన ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ పీవో, సూపర్‌వైజర్లతో మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఏఎల్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. నాడు-నేడు, పోషణ్ అభియాన్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కార్యక్రమాలను పరిశీలించారు. గొలుగొండ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లిటౌన్: ఏపీ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులైన పీటీఐ(వర్క్, ఆర్ట్, హెల్త్, పీఈటీ)లు బదిలీల కోసం ఈనెల 20వ తేదీ లోపు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు పథకం సమన్వయకర్త ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తేదీదాటితే ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబోమని ఆమె చెప్పారు.

ఆణిముత్యాలు.. చేరుకోవాలి ఉన్నత శిఖరాలు

- అదే సీఎం వైఎస్ జగన్ ఆశయం
- ఆయన కలల్ని నిజం చేసిన జిల్లా విద్యార్థులు
- జిల్లాస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్





ఆణిముత్యాలు పురస్కారాలు పొందిన టెన్త్, ఇంటర్ విద్యార్థులతో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ పాఠశాలలను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దాలి.. ప్రతి పేద విద్యార్థికి భారం లేని చదువులు అందించాలి.. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలి.. ఇదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. ఆయన కలల్ని నిజం చేసిన ఉత్తమ విద్యార్థులను నగదు పురస్కారాలతో సత్కరించి, మిగతా వారిలో స్ఫూర్తి నింపేందుకే ఈ ఆణిముత్యాలు కార్యక్రమం.. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులందరూ అద్భుతాలు సాధించాలి.. అంటూ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. స్థానిక జీవీఎంసీ పెద్దహైస్కూల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించడానికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో సామాన్యులకు సైతం ఉన్నత చదువులు చేరువ చేయగా.. ఆ యన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను మునుపెన్నడూ చూడని రీతిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు.

అభినందనీయం

మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ మేనమామగా బాధ్యత తీసుకుని బాలలకు అత్యుత్తమ విద్యను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి పదో తరగతిలో ఐదుగురు, ఇంటర్‌లో ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. జగనన్న గోరుముద్ద, విద్యాకానుక, బైజూస్ ట్యాబ్‌లతో డిజిటల్ బోధన సత్ఫలితాలు సాధించిందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థినులకు రూ.కోటి 50 లక్షల నిధులతో 2600 సైకిళ్లు ఉచితంగా పదిరోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో మోడల్ విద్యను ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విద్యలో డబ్ల్యూహెచ్‌వో అవార్డు కూడా మన రాష్ట్రానికి దక్కడం అభినందనీయమన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ పదో తరగతిలో 594 మార్కులతో జిల్లా విద్యార్థిని రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం శుభపరిణామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో రూ.16.2 లక్షల నగదు పురస్కారాలు అందిస్తున్నామన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎన్.సుజాత, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడారు. పదో తరగతి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన 26మంది విద్యార్థులకు వరుసగా రూ.50 వేలు, 30 వేలు, 15 వేల నగదు పురస్కారం, శాలువ, ధ్రువపత్రం అందించారు. ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 17మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు వంతున పురస్కారాలు ప్రదానం చేశారు. అంతకుముందు విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విద్యార్థినులకు ఇచ్చే సైకిల్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంఈవో దివాకర్, జీవీఎంసీ హైస్కూల్ హెచ్‌ఎం జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన





పదో తరగతి, ఇంటర్‌లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారం, ధ్రువపత్రం అందిస్తున్న మంత్రులు

రైవాడ రొయ్యి.. భలే పసందోయి



రైవాడ జలాశయంలోని నోరూరించే రొయ్యిలు



రైవాడ జలాశయంలో బుట్టలతో రొయ్యిల వేట సాగిస్తున్న వేటదారులు

- రుచిలో లేదు సాటి... మార్కెట్‌లో మంచి గిరాకీ
- ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు
- 10 గ్రామాల ప్రజలకు జీవనాధారం
- రోజుకు 50 నుంచి 100 కిలోల వరకు లభ్యం

దేవరాపల్లి : మత్స్య ఉత్పత్తుల్లో రొయ్యది ప్రత్యేక స్థానం...సాటి లేని రుచితో మాంసాహార ప్రియులను ఇట్టే ఆకర్షిస్తుంది. నదులు జలాశయాల్లో దొరికే రొయ్యిలు రుచిలో వాటికవే సాటి. జిల్లాలో పలు జలాశయాలున్నా..అందులోనూ రైవాడ జలాశయంలో దొరికే రొయ్యి మరింత ప్రత్యేకం. పసందైన రైవాడ రొయ్యి కోసం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సైతం వినియోగదారులు వచ్చి కొనుగోలు చేస్తారు. మార్కెట్‌లో రైవాడ రొయ్యికి మంచి గిరాకీ ఉండంతో స్థానిక వ్యాపారులు ఇక్కడ ఖరీదు చేసి పొరుగు రాష్ట్రాలకు విక్రయిస్తూ మంచి లాభాలు గడిస్తుంటారు. స్థానికంగా దొరికే రొయ్యిలను సైజుల వారీగా ఎంపిక చేసి ఇతర రాష్ట్రాల తరలిస్తారు.

టైగర్ రొయ్యి...

రైవాడ జలాశయంలో కాల రొయ్యి, జన రొయ్యి, టైగర్ రకాల రొయ్యిలు దొరుకుతాయి. వీటిలో టైగర్ రకం రొయ్యి అత్యధికంగా 500 గ్రాముల బరువుతో లభిస్తాయి. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ. 350 నుంచి 400 వరకు ధర పలుకుతుంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లోను, మరలా సెప్టెంబర్ నెలలో జలాశయం నిండుగా ఉన్న సమయంలో మాత్రం రొయ్యిలు లభిస్తాయి.

150 కుటుంబాలకు జీవనోపాధి

రొయ్యిల వేట చేస్తూ సుమారు 150 మంది వేటదారులు ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. అనకాపల్లి జిల్లాలోని రైవాడ, బేతపూడి, సొంపురం, పాతబొడ్డపాడు, కొత్తబొడ్డపాడు, లోవముకుంద పురం గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని జీనబాడు, కొరపర్తి తదితర గ్రామాలకు చెందినవారు రొయ్యిల వేట సాగిస్తూ జీవనాధారం పొందుతున్నారు. రోజుకు సుమారు 50 నుండి 100 కేజీల వరకు రొయ్యిలు లభిస్తాయి.

కొబ్బరి ముక్కలు ఎరవేసి..



జలాశయంలోకి నాటు పడవపై వెళ్లి నీటిలో బుట్టలను వేసి రొయ్యిలకు ఎరగా కొబ్బరి ముక్కలను పెడతాం. ఉదయం 8 గంటల ప్రాంతంలో బుట్ట వేసి మరలా మరుసటి రోజు ఉదయం అదే సమయానికి బుట్టలో చిక్కుకున్న రొయ్యిలను తీస్తాం. అలా తీసిన రొయ్యిలను స్థానిక వ్యాపారులకు విక్రయించి జీవనోపాధి పొందుతున్నాం.

–బొండు జగ్గ, వేటదారుడు, రైవాడ.

రోజుకు 3-4 కేజీలు..



జలాశయంలో ఎక్కువ బుట్టలు వేసిన వారికి రోజుకు 3 లేదా 5 కేజీల వరకు రొయ్యిలు దొరుకుతాయి. తక్కువ బుట్టలు వేసిన వారికి ఒకట్రెండు కేజీలు మాత్రమే దొరుకుతాయి. ఏడాదిలో కేవలం మూడు నెలల్లో మాత్రం బాగా రొయ్యిలు దొరుకుతాయి. రైవాడ రొయ్యిలు రుచికరంగా ఉండడంతో ఇతర జిల్లాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు.

–కొమార నూకరాజు, వేటదారుడు, రైవాడ

పేదల బతుకుల్లో చీకట్లు

కాలం కత్తి కట్టింది..దారికాసి కాటేసింది.. శనిదేవుని దయ తమపై ఉండాలని.. అన్నీ శుభాలే జరగాలని అమావాస్య రోజు పూజలు చేసేందుకు బయలుదేరిన వారు ఇంకా ఆలయానికి చేరకముందే ఘోరం జరిగిపోయింది. మరికాసేపట్లో గమ్యం చేరుకుంటారన్నలోపే మృత్యువు కబళించింది.. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం అలముకుంది.

- కోనసీమ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- చోడవరం మండలానికి చెందిన నలుగురు మృతి
- శోకసంద్రంలో ముద్దుర్తి

చోడవరం రూరల్: వారందరూ పేదలే.. రెక్కాడితే గాని పొద్దుగడవని జీవితాలు వారివి. శనిదేవునికి పూజ చేస్తే తమ బతుకులు బాగుపడతాయని భావించారు. శనివారం అమావాస్య కావడంతో మందపల్లిలో శనీశ్వర ఆలయంలో పూజ చేసేందుకు శుక్రవారం రాత్రి చోడవరం మండలంలోని ముద్దుర్తి గ్రామం నుంచి తొమ్మిది మంది వ్యాన్‌లో బయలుదేరారు. మరికాసేపట్లో గమ్యం చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని కారు ఢీకొనడంతో సంఘటన స్థలంలో ముగ్గురు, చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురు గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. బోడి వెంకటరమణ, గంగిరెడ్ల శ్రీను, పతివాడ కన్నయ్య నాయుడులు ప్రమాద స్థలిలోనే మరణించగా, తీవ్ర గాయాలపాలైన వాహన డ్రైవర్ బోడి వెంకునాయుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముద్దుర్తి గ్రామానికి చెందిన బోడి సత్యనారాయణ, కోసూరి నర్సింగరావు, మువ్వల శ్రీను, తుమ్మన శ్రీను, అంకుపాలెం గ్రామానికి చెందిన హేయంత్‌లు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ పిడుగులాంటి వార్త విని మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సమాచారం తెలియగానే సర్పంచ్ కె.వెంకట్, మాజీ సర్పంచ్ అప్పికొండ సోమేశ్వరరావు బాధితుల కుటుంబ సభ్యులు ప్రమాదస్థలమైన కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడ ప్రాంతానికి బయలుదేరారు.



విషాదంలో మునిగిపోయిన మృతుడు శ్రీను కుటుంబం

మాకు దిక్కెవరు...

ప్రమాదంలో మృతి చెందిన గంగిరెడ్ల శ్రీనుకు భార్య విజయ, పిల్లలు మేఘన, హర్షవర్ధన్ ఉన్నారు. శ్రీను తమ్ముడు గోవింద్,అక్క దేముళ్లమ్మ దివ్యాంగులు. తన కుటుంబంతో పాటు దివ్యాంగులైన తమ్ముడు,అక్క బాగోగులను శ్రీను చూస్తున్నాడు. శ్రీను చనిపోవడంతో ఇక మాకు దిక్కెవరంటూ ఆయన భార్యాపిల్లలు, దివ్యాంగులైన సోదరీ, సోదరుడు గుండెలవిసేలా రోదించడం అందరినీ కంట తడిపెట్టించింది.



బాధితులను పరామర్శించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

అన్న వెంటే తమ్ముడు..

గ్రామానికి చెందిన అన్నదమ్ములైన బోడి వెంకటరమణ, బోడి వెంకునాయుడు ప్రమాదంలో మృతిచెందారు.వెంకటరమణకు భార్య దేముడమ్మ, ముగ్గురు పిల్లలు, వెంకునాయుడుకు భార్య సత్యవతి ఒక ఆడపిల్ల ఉన్నారు.

పెద్ద దిక్కు కోల్పోయాం

తివాడ కన్నయ్య లింగం వృత్తి రీత్యా తాపీమేస్త్రి. రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య పార్వతి, కుమారుడు సాయి ఉన్నారు. సాయి గ్రామంలో వలంటీరుగా సేవలందిస్తున్నాడు. కుటుంబ పెద్దను కోల్పోయామని, తమకు దిక్కెవరి భార్యాకుమారుడు తీవ్రంగా రోదించారు.

కుటుంబాలకు అండగా ఉంటా: ధర్మశ్రీ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ రవిపట్టాన్ శెట్టితో ఫోన్‌లో మాట్లాడి మృతి చెందిన వారి, బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని, తక్షణ వైద్య, ఇతర సహాయ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.

ఫాదర్స్‌డే శుభాకాంక్షలు

- Advt Feature

రామభద్రరాజుకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న ఎంపీ వెంకట సత్యవతి


నివాళి అర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కోటవురట్ల: ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్. రామభద్రరాజు పెద్దకర్మ కార్యక్రమం తంగేడులోని ఆయన నివాసంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. రామభద్రరాజు కుమారుడు సతీష్ రాజుకు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ రామచంద్రరాజు, రాంబాబురాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, సీతబాబు, వరహాలబాబురాజు, సత్యనారాయణరాజు, లక్ష్మీనరసింహరాజు పాల్గొన్నారు.


విద్యుదాఘాతంతో రైతు మృతి



చోడవరం రూరల్ : జన్నవరంలో పొలంలో విద్యుత్ మీటర్‌ను ఆన్ చేసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై రైతు నేమాల సూర్యనారాయణ శనివారం మృతి చెందాడు. స్విచ్ బాక్సులో వైర్లను ఎలుకలు కొరికివేసి ఉండడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. అతడికి వివాహమైన కుమార్తెతోపాటు మరో కుమార్తె, డిగ్రీ చదువుతున్న కుమారుడు ఉన్నారు. భార్య అచేతనురాలు. సొంత పొలం 70 సెంట్లకు మించి లేకున్నా పొరుగు రైతుల భూములని కౌలుకు చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. సర్పంచ్ సన్యాసిరావు, పాలసొసైటీ ప్రెసిడెంట్ కడియం గౌరీశంకర్ మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు. చోడవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాన్నా నీకు వందనం

- ఎల్లలు లేని తండ్రి ప్రేమ
- నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం



మహారాణిపేట : నాన్న ప్రేమకు ఎల్లలుండవు. పిల్లలకు ఎలాంటి కష్టం తెలియకుండా పెంచి పెద్ద చేసేందుకు తండ్రి కష్టపడతాడు. కుటుంబ అవసరాల కోసం తన సుఖాలను పక్కన పెట్టి శ్రమిస్తాడు. అలాంటి తండ్రిని పితృదేవుడిగా కీర్తిస్తూ ప్రతి ఏటా జూన్ మూడో ఆదివారం ఫాదర్స్‌డే జరుపుకోవడం ఆనవాయితీ. అమెరికాకు చెందిన సోనారా స్మార్ట్ డాడ్ అనే మహిళ కుటుంబం కోసమే ఆలోచించే తండ్రి కోసం ఏదైనా చేయాలని ఆలోచించి నాన్న కోసం తొలుత ప్రచారం మొదలు పెట్టారు. దాని ఫలితంగానే 1910 నుండి ఫాదర్స్‌డే జరుపుకుంటున్నాం.

ఎంతో నేర్చుకున్నాం



మా తండ్రి (ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.రవిశంకర్) నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. వృత్తిలో ఎన్ని వత్తిడిలున్నా మాతో స్నేహితుడిలా ఉంటారు. తరచు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళుతూ కుటుంబ సభ్యులను ఆహ్లాదపరుస్తూ ఉంటారు. క్రమశిక్షణ, సత్ప్రవర్తన ఆయన దగ్గరే నేర్చుకున్నాం.

-బి.రిషిక్, ఒమేగా ఆస్పత్రి ఎండీ రవిశంకర్ కుమారుడు

విలువలు నేర్పించారు



మా తండ్రి పూర్ణచంద్రరావు (భూ మాత రియల్ ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టర్)నాకు విలువలు నేర్పించారు. ఇంట్లో ఎప్పుడూ సరదాగా ఉంటారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పేదలకు వైద్య సేవలు అందిస్తాను. మా తండ్రి ఆశయాలు నెరవేరుస్తాను.

- డా.తాళ్లూరి ప్రశాంత్, భూమాత రియల్ ఎస్టేట్ ఎండీ కుమారుడు

మంచితనానికి మారుపేరు మా తండ్రి



మంచికి, మానవత్వానికి మారుపేరు మా తండ్రి వైశ్యరాజు పాల్గుణరాజు. ఆయన అందరికీ ఆత్మీయ బంధువు. ఆయన వద్ద నుంచి క్రమశిక్షణతో పాటు మరెన్నో మంచి విషయాలు నేర్చుకున్నాను. ఇంకా నేర్చుకుంటాను.

- వైశ్యరాజు భద్రగిరిరాజు

సేవాదృక్పథం ముఖ్యమని చెబుతారు



నేను ఎంఎస్సీ కంప్యూటర్స్ చేశాను. నా తండ్రి వనకూరు మధుసూదనరెడ్డి సహకారం, ప్రోత్సాహంతో సేంద్రియ ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్నాను. మనం ఏం చేసినా సేవాదృక్పథం ముఖ్యం అని ఆయన అంటారు. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా జీవించాలని నాకు చెబుతుంటారు.

- వనకూరు లక్ష్మీతేజ, సత్య నేచురల్స్

'లారస్' సీఎస్సార్ నిధులతో హాస్టల్ రీమోడల్

ప్రారంభించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


వసతిగృహం నాడు-నేడు ఫొటోలను తిలకిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలబడి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారన్నారని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహాన్ని లారస్ పరిశ్రమ సుమారు రూ.55 లక్షల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి రీ మోడల్ చేసింది. పనులు పూర్తి కావడంతో నూతన వసతులను ప్రారంభించేందుకు కలెక్టర్ హాస్టల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వసతి గృహాన్ని సందర్శించినప్పుడు బాలికలు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు.

లారస్ పరిశ్రమ నిర్వాహకులతో చర్చించడంతో వారు ముందుకు వచ్చి అన్ని వసతులతో అందంగా తీర్చిదిద్దారని, నెలన్నర స్వల్ప వ్యవధిలోనే పనులను పూర్తి చేశారని అభినందించారు. వసతి గృహం మరమ్మతులు, పైపులైన్ల ఏర్పాటు, ప్రహరీ ఎత్తు పెంచడం, టాయిలెట్లు, బాత్‌రూములకు మరమ్మతులు, భవనానికి రంగులు, ఇతర సదుపాయల ఏర్పాటును పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. నాడు-నేడు వసతి గృహం పరిస్థితిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటోలను కలెక్టర్ ఆసక్తిగా తిలకించి వీటిని భద్రపరచాలని వసతి గృహం అధికారులకు సూచించారు. లారస్ పరిశ్రమ చైర్మన్ సిహెచ్.సత్యనారాయణ, వైస్ చైర్మన్ సిహెచ్.నరసింహారావు, సీఎస్ఆర్ ఫండ్ చైర్మన్ సౌమ్య, హెచ్ఆర్ రామకృష్ణ, వసతి గృహం సీఈఒ నిర్మల, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఉప తహసీల్దార్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ సేవలు

చినపాచిలలో ప్రారంభం

రావికమతం : భూముల కొనుగోలు, అమ్మకాలులో ఖర్చులు తగ్గించాలనే సంకల్పంతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తెస్తామన్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి హామీ మేరకు చినపాచిల గ్రామ సచివాలయంలో భూమి కొనుగోలు, అమ్మకాల ప్రక్రియ శనివారం లాంఛనంగా ప్రారంభమైంది. ఆ గ్రామానికి చెందిన కరెడ్ల రాజులమ్మ సెంటున్నర నివాస స్థలాన్ని ఆమె కోడలు భవానికి ఆ గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి.గీతారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పూర్తిగా విజయవంతమైంది. ఆ గ్రామానికి చెందిన కరెడ్ల రాజులమ్మ తన కోడలు భవానీకి సెంటున్నర నివాస స్థలం ఇవ్వాలని నిర్ణయించుకుని రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చేందుకు శనివారం చోడవరం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కుమారుడు సత్తిబాబు, కోడలు భవానీతో సహా వెళ్లారు. అయితే సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి మీ సొంత గ్రామంలోనే సచివాలయంలోనే ఈ కార్యక్రమం జరుగుతుందని వారిని తిరిగి ఇంటికి పంపేశారు. ఆ తర్వాత ఆమె సూచనలతో రూ.లక్ష విలువైన నివాస స్థలంను రాజులమ్మ ఆమె కోడలు భవానీకి రాసి ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు. అక్కడికక్కడే పత్రాన్ని కూడా ఇచ్చేశారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్టాంపు డ్యూటీ ప్రకారం రమారమి రూ.5వేలు మాత్రమే ఖర్చయిందని, అదీ తమ గ్రామంలోనే పూర్తవ్వడంతో ఖర్చులు చాలా మేరకు తగ్గాయని రాజులమ్మ పేర్కొన్నారు. గతంలో అలాగే చోడవరం వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోగా బయటి ఖర్చులు, మామూళ్లు, సాక్షుల ఖర్చులన్నీ కలిపి రూ.35 వేలు అయ్యాయని ఇపుడు ఏ శ్రమ లేకుండా తక్కువ ఖర్చుతో పనైపోయిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గుర్రం కోటేశ్వరరావు,శేఖర్,రామారావు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కాంట్రాక్టు ఉద్యోగుల సంబరాలు


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, వేడుకల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని కాంట్రాక్టు ఉద్యోగులంతా ఆనందం వ్యక్తం చేశారు. చోడవరం నియోజకవర్గంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులంతా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చోడవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నోయేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న తమను ఏ ప్రభుత్వం గుర్తించలేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులైజేషన్ చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజలతోపాటు ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఎంతో మేలు చేసే కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

2న గిరి ప్రదక్షిణ

సింహాచలం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే నెల 2న గిరి ప్రదక్షిణ, 3న ఆలయ ప్రదక్షిణలను అన్ని శాఖల సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తామని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో డి.భ్రమరాంబ తెలిపారు. వీటికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం ఆమె పోలీస్, ఆర్టీసీ, జీవీఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ, ఫైర్, దేవస్థానం తదితర శాఖల అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈసారి ఆరు లక్షల మంది వరకు గిరి ప్రదక్షిణ చేస్తారని, లక్ష నుంచి లక్ష యాభైవేల మంది సింహగిరికి దర్శనానికి వస్తారని, జూలై 3న ఆలయ ప్రదక్షిణల్లో పదిహేను వేలమంది వరకు పాల్గొంటారని అంచనా వేసినట్టు ఈవో తెలిపారు.

క్యాన్సర్ ఆస్పత్రిలో సుభోజనం

అగనంపూడి (గాజువాక): హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు ఈ నెల 20వ తేదీ నుంచి సుభోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశామని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస తెలిపారు.

మరిన్ని క్లాసిఫైడ్స్ 9వ పేజీలో

క్లుప్తంగా

విద్యుత్ సరఫరా బంద్ రేపు

అనకాపల్లిటౌన్: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో డి-1 సెక్షన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నందున సోమవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్) కె.రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డి-1 సెక్షన్ పరిధిలో గుండాల జంక్షన్, సాయినగర్, లక్ష్మీదేవిపేట, మిరియాల కాలనీ, అంజయ్యకాలనీ, విజయరామరాజు పేట, ఎంఎంసీ కాలనీ, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

నేడు జిల్లా రైతు కూలీసంఘం మహాసభ

అనకాపల్లిటౌన్: స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ నిర్వహించనున్నట్టు సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి ఝాన్సీ, సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ హాజరుకానున్నట్టు చెప్పారు.

వడగాడ్పులతో అవస్థలు



కశింకోటలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజలు శనివారం వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. అధిక ఉష్ణోగ్రతతోపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు వడగాల్పులు వీయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు సతమతమయ్యారు. కశింకోటలో ప్రధాన రహదారులు జన సంచారం లేక బోసి పోయాయి.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న నాయకులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూలులో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన బుదిరెడ్డి చంద్రశేఖర్ (564), మజ్జి పవన్‌కుమార్ (558), భీముని లీలా ఆదిలక్ష్మి (496)లను శనివారం సత్కరించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పతకాలతోపాటు నగదుబహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, హెచ్ఎం సునీత, స్కూలు కమిటీ చైర్మన్ సేనాపతి లక్ష్మి, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కె.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆదిపురుష్	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
ది ఫ్లాష్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 17 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-5 యూనిట్లు, ఒ పాజిటివ్-5 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ నెగిటివ్ 1 యూనిట్, ఏబీ పాజిటివ్ 2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 329 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 246 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

అన్ని వర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



సత్యనారాయణపురంలో వృద్ధుడికి సంక్షేమ పథకాల వివరాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

- జగనన్నను మరోసారి ఆశీర్వదించండి
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- సత్యనారాయణపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లి రూరల్: పార్టీలకతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.రాష్ట్రంలో సుపరిపాలన సాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.మండలంలోని సత్యనారాయణపురంలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఏయే పథకాల కింద ఎంత మేలు జరిగిందో చదివి వినిపించారు. ప్రతి కుటుంబానికి సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులెదురైనా నిరాటంకంగా సంక్షేమ పథకాలను సీఎం అమలు చేస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు.గత ప్రభుత్వంలో సంక్షేమ పథకం కావాలన్నా, నివాస స్థలం పొందాలన్నా నాయకులు,అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసి వచ్చేదని చెప్పారు. అయినా ఆ విజ్ఞాపనలు బుట్ట దాఖలయ్యే దారుణ పరిస్థితులు మీరంతా చూసిన విషయాన్ని మర్చిపోకూడదని గ్రామస్తులకు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని తెలిపారు. తమ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. గ్రామానికి నేరుగా రావడానికి వీలుగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు మంత్రికి విన్నవించారు.ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరగా తక్షణమే రూ.5 లక్షలు మంజూరు చేశారు. రూ.20 లక్షలతో గ్రామంలో నిర్మించిన అంతర్గత సీసీ రహదారులను ప్రారంభించారు.సత్యనారాయణపురం,మూలపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రి అందజేశారు. అంతకుముందు మంత్రికి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గ్రామంలో నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, పలకా సత్యనారాయణ,ఎంపీటీసీ జోగా నాగమణి,జోగా నాగేశ్వరరావు,రావి కిషోర్, ఉప సర్పంచ్ తోటకూరి భవానీ, అప్పలరాజు,ఎంపీడీవో కె.వి.నరసింహరావు, తహసీల్దార్ గంగాధరరావు, ఎండీపీవో ప్రభావతి,డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, డీఆర్‌డీఏ ఏపీఎం నీలాచలం పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం



పరీక్ష చేస్తున్న వైద్యుడు

అనకాపల్లిటౌన్: మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సానా త్రినాథరావు అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీకల్యాణ మండపంలో శనివారం అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు రొమ్ముక్యాన్సర్, గర్భసంచి, నోటిక్యాన్సర్‌కు ఉచిత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా విక్రయానికి ఉంచే తినుబండారాలు తీసుకోవడం ద్వారా వ్యాధులబారిన పడే అవకాశముందన్నారు. ఈ సందర్భంగా 75 మందికి ఉచితంగా పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.రాజేష్‌నాయుడు, అసిస్టెంట్ గవర్నర్ పి.పవన్, క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యకాలనీలో నేడు గడప గడపకు..

అనకాపల్లిటౌన్: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ పరిధి సుబ్రహ్మణ్యకాలనీలో ఆదివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వశాఖ అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ సత్యవతికి మొక్కను అందజేస్తున్న ఎంపీడీవో నరసింహం

అనకాపల్లిటౌన్: మండలంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో నరసింహంకు ఎంపీ సత్యవతి సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరసింహం స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ సత్యవతిని శనివారం మర్యాదపూర్వంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలన్నారు.

నేడు దంత సమస్యలపై సదస్సు

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జిక్లబ్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత సమస్యలు- నివారణ పద్ధతులపై సదస్సు నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు సాంబశివరావు శనివారం తెలిపారు. ఈ సదస్సులో దంత వైద్యనిపుణులు గణేష్‌బాబు ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు.

చోరీకి యత్నించిన ముగ్గురిపై కేసు

అనకాపల్లిటౌన్: ఆలయంలో హుండీని చోరీ చేసేందుకు యత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరసింగరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం మంత్రిపాలేనికి చెందిన కొల్లి ప్రసన్నకుమార్, తెడ్డు ప్రేమ్‌కార్తీక్, ఎర్రి దావిద్‌లు మండలంలో గొర్లివానిపాలెంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో హుండీని చోరీ చేసేందుకు యత్నించారు. ఆ సమయంలో వారిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

పదోన్నతి పొందిన డీటీకి సన్మానం



వాసును సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: కలెక్టరేట్‌లో ల్యాండ్ అండ్ లీగల్ సెల్ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా నాతవరానికి వెళుతున్న సింగంపల్లి వాసును పలు స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన అవసరం



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏవో

నక్కపల్లి: రైతులు విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకుంటే మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. శనివారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద వివిధ గ్రామాలకు చెందిన ఆర్‌బీకేల్లో పనిచేసే సిబ్బందికి విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. వరిలో వచ్చే తెగుళ్లకు సూడోమోనాస్ విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. నారుకుళ్లు, అగ్గితెగులు, ఆకుముడత తెగులు పొడ, ఎండుతెగుల నివారణకు సూడోమోనాస్ విత్తన శుద్ధి ద్వారా నివారించవచ్చన్నారు. విత్తనశుద్ధికి 10 గ్రాముల సూడోమోనాస్ పొడిని ఒక కిలో విత్తనానికి కలిపి ఒక రోజు నానబెట్టాలన్నారు. ఎక్కువ నీరు ఉంటే తీసేసి మొలకలు వచ్చినపుడు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో నో బ్యాగ్ డే



కొత్తపేటలో స్కూల్లో నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

రాంబిల్లి : మండలంలో పలు పాఠశాలల్లో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చిత్రలేఖనం తదితర అంశాలపై తర్ఫీదునిచ్చారు. పలు రకాల ఆటలను ఆడించారు.

ఈ సందర్భంగా ఎంఈవో ఎం. సూర్యారావు మాట్లాడుతూ, ప్రతి నెలా మూడో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

మంటలతో ఆందోళన

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం, జగ్గన్నపేట, పల్లపుఆనందపురం గ్రామాల మధ్య ఉన్న పొలాల్లో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సుమారు 15 ఎకరాల మేర పొలాల్లోని గడ్డి, చెరకు దగ్ధం కావడంతో పరిసర ప్రాంత రైతులు ఆందోళనకు గురై మంటలను ఆర్పేందుకు కృషి చేశారు. వేసవి తీవ్రతతో పాటు, వడగాడ్పుల నేపథ్యంలో పొలాల్లోని గడ్డి ఎండిపోయింది. దీంతో మంటల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని ఆందోళనతో రైతులు పరుగులు తీశారు.మంటలు అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

భజన బృందాలకు సత్కారం

పాయకరావుపేట: కుమారపురం గ్రామంలో గల దుర్గాలమ్మ ఆలయంలో భజన చేసిన బృందాలను గ్రామ పెద్దలు సత్కరించినట్టు సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. సంవత్సరాలుగా ప్రతి శుక్రవారం ఆలయంలో 2 గంటల పాటు భజన చేస్తున్న బృందాలను ఘనంగా సత్కరించినట్టు చెప్పారు. భక్తులందరూ ఎంతో ఉత్సాహంగా అమ్మవారి సేవలో పాల్గొంటున్నారన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



త్రిపురవానిపాలెంలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

కశింకోట: గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందు తప్పని సరిగా వేయించాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. మండలంలోని నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెంలో గొర్రెలు, మేకలకు శనివారం ఉచితంగా నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మందు వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 30 వరకు గ్రామాల వారీగా నట్టల నివారణ మందు వేయనున్నట్టు తెలిపారు. వైఎస్ ఎంపీపీ నమ్మి మీనా, సర్పంచ్ కలిగెట్ల నూకరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు కలిగెట్ల నాయుడు, నమ్మి గణేష్, పశు వైద్య సహాయకులు రాజేష్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణం



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా దశల వారీగా డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు చెప్పారు. మండలంలో గోపాలపురం పంచాయతీ వెంకటరమణపేటలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజాపరిషత్ నిధులతో అన్ని గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంచేసినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ దుల్ల అప్పలరాజు, మండల కో ఆప్షన్‌సభ్యుడు బొండా అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు బంటు శివ, రమణ, కరణం సత్తిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ రాటోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మహిళలు, ఆలయ నిర్వాహకులు

అనకాపల్లిటౌన్: పట్టణంలో గవరపాలెం సతకంపట్టు వద్ద కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ వద్ద శనివారం దుర్గామల్లేశ్వరస్వామి పెళ్లిరాటోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బి.వెంకటరమణ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అతిసార నివారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యులు సుజాత

ఎస్.రాయవరం: అతిసార ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ ఇన్‌ఛార్జి ఆయుర్వేద వైద్యులు సుజాత సూచించారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా పీహెచ్‌సీ వద్ద సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ అతిసార ప్రబలిన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందన్నారు. వేసవిలో కలుషిత నీటిని తీసుకున్నవారిలో ఎక్కువగా ప్రబలుతుందన్నారు. నెల రోజుల పాటు పీహెచ్‌సీ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కాగా పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ పీహెచ్‌సీ పరిధిలో ఒక్కరు కూడా కార్యక్రమానికి హాజరు కాకపోవడం విశేషం. ఇరువురు వచ్చినట్టు హాజరు పట్టీలో మాత్రం హాజరు ఉంది. కార్యక్రమంలో మలేరియా ఇన్‌ఛార్జి నోడల్ అధికారి పి.ఎస్.వి.ఎస్ ప్రసాద్, సచివాలయ హెల్త్ సెక్రటరీ ఎన్. రాజేశ్వరి, స్టాఫ్ నర్స్ వెంకట్, ల్యాబ్ టెక్నీషియన్ ఇందల హరి, ఎఫ్ఎన్‌వో హారిక పాల్గొన్నారు.